


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -184-

**(23 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**వేసవికాలం ప్రతి సంవత్సరం** వస్తూనే వుంటుంది. సూర్యభగవానుడు తన ప్రతాపం చూపిస్తూనే వుంటాడు. "ఏమిటి ప్రభూ! ఇంత నిర్దయ?" అంటే, "ఒక్క నెల వోర్చుకోండి ఎలాగో... ఒక్క నెల.. లేకపోతే భూమాత పంటలు పండించడం కష్టం. ఎండి వెరియలు కొట్టిన భూమి మీద వర్షం పడాలి. అది మైనం కావాలి. మైనమేమిటి? నల్లని నవనీతం కావాలి" అంటాడాయన.

భూములు సరిగా పండాలంటే ఎండలు అవసరమంటారు నిజమే. అది ఋతు ధర్మాలకు చెందిన పరమ సత్యం. కాని ఇప్పుడు చాలా ధర్మాలు తప్పుకుంటున్నాయి. రేడియోలో సంగీత శిక్షణలాగా క్రొత్తపాటలు, పుణుతలు చెప్పుకుంటున్నాయి. ఫలితాలు మారడం వల్లనే.

ఈ రోజుల్లో దాళవా పంటలు రావడం వల్ల భూమి ఆరడమంటూ లేదు. బీటలు పారడం దాకా ఎక్కడ? సిటీ బస్సు ఒక చోటికి రాగానే తిరుగు ట్రిప్పు జనం ఎక్కి కూర్చున్నట్లు మళ్ళీ క్రొత్త నీరు వచ్చి పడుతుంది.

మరి ఎండి బీటలు పారే ప్రసక్తి లేదు గనుక వో భాస్కరమూర్తీ నీ ప్రతాపం కొంచెం తగ్గించమంటే తగ్గిస్తాడా? మన మాటకు చెవి ఒగ్గుతాడా?

"మొత్తానికి ఈ సంవత్సరం విజయవాడలో ఎండలు తక్కువే. అప్పుడప్పుడు చినుకులు పడుతున్నాయి. చెప్పకుండా ఆకాశం మీద మబ్బులు అలుముకొంటున్నాయి. వడగాడ్పులు తక్కువ. అందువల్ల ఇళ్ళల్లో పడిగాపులు కూడా తక్కువగానే వున్నాయి" అన్నాడొక గృహస్థు.

మొన్న ఒకాయన అన్నాడు "ఇవేం ఎండలండీ ఎందుకు అలా భయపడతారు. ఎండవేళప్పుడు ఇంట్లోనే వుంటారాయె. ఒక నిద్రపోయి లేస్తే చల్లపడిపోతుంది. రాత్రిళ్ళు ఎలాగూ చల్లగానే వుంటుంది. బారేజి దయవల్ల. బెజవాడ విజయవాడగా మారిన తరవాత వేడిగాడ్పులు తగ్గాయండీ.

అదివరలో పగలు ఎండ, రాత్రిళ్ళు వడగాడ్పులు తెల్లవారు ఝామున ఒక రెండుగంటలు ఇంటర్వెల్ వుండేది. తెల్లవారి తలుపు తీసేటప్పటికే చండ్ర నిప్పులు ఇంట్లో పడేవి ఎక్కడినుంచో విసిరేసినట్లు. అప్పటినుంచీ తడి బట్టలు ముసుగు వేసుకుని కూర్చోవడమే" అన్నారాయన.

ఆయనగారు చెప్పినదాంట్లో ఎంత సత్యం వుందో! విజయవాడగా మారిన తర్వాత కొంతవేడి తగ్గినట్లే వుంది ఇంతకాలమ్. బెజవాడకే 'బ్లేజ్‌వాడా' అనే పేరు వచ్చింది. రైళ్ళు రాత్రిపూట విజయవాడ స్టేషనులో నుంచి వెడుతున్న ప్రయాణికులు అదిరిపోయేవారు. తడి జేబురుమాళ్ళు ముక్కుల మీద వేసుకుని "దుర్గమ్మ తల్లీ రక్షించు" అని ప్రార్థించేవారుట. మళ్ళీ ఈ సంవత్సరం ఆ పేరు నిలబెట్టుకుంది.

బెజవాడ, రెంటచింతల, భద్రాచలం, రామగుండం, అప్పుడప్పుడూ నిజామాబాద్, నెల్లూరులు – వేసవి ఎండలకు ప్రసిద్ధి చెందాయి. సూర్యుని ప్రభావం వీటిమీద ఎక్కువగా వుండేది. విజయవాడలో రోహిణిమీద వింత వింత కథలు చెపుతూ వుంటారు.

సిగరెట్టు కాల్చేవాళ్ళు అగ్గిపుల్ల ఎండలో  పెడితే అంటుకుంటుందని బాపూగారు చమత్కరించారు. రోహిణీ కార్తెలో విజయవాడ రోడ్డుమీద అరగంట నిలబెడితే, ఆరునెలల శిక్షకన్నా ఎక్కువ – అని లతగారు కాబోలు ఒకసారి వ్రాశారు.

ఒక ఊళ్ళో ఎవరో గృహస్థు తన భార్యను గురించి బంధువుల ముసలమ్మతో చెప్పుకుని బాధపడుతున్నాడుట. ఆవిడకేం శిక్షవెయ్యాలో, ఏం చెయ్యాలో తోచడం లేదన్నాడు.

ఆ ముసలమ్మ వెంటనే అందిట."ఏం అక్కరలేదు. ఆడదానికి శిక్షేమిటి? తర్వాత అంతా ఒకటే అవుతారు. ప్రస్తుతం చెప్పినమాట వినడంలేదంటున్నావు గనుక రోహిణి కార్తెలో రెండురోజులు బెజవాడలో వున్న చుట్టాలింటికి పంపించు. మేడమీద కాపురం వున్నవాళ్ళ ఇంటికి పంపితే మరీ మంచిది" అన్నదట.

మొన్న ఒక మిత్రుడు వచ్చి "ఈ నెల ఇరవై నాలుగోతేదీ ఉదయం పదకొండు గంటలకు మా అబ్బాయి వివాహం మీరు తప్పకుండా వచ్చి వధూవరుల్ని ఆశీర్వదించి, విందారగించి, మర్నాడు గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం చేయించాలి. ఆ సాయంత్రం టీపార్టీ, పాట కచేరీ. మీరు రాకపోతే చాలా బాధపడతాను. మీ బోటివారు వస్తేనే వివాహం శోభస్కరంగా వుండేది" అన్నాడు.

రోహిణీ కార్తీ, అందులో పగలు పదకొండు గంటలకు లగ్నం, ఏ రెండున్నరకో విందు.. ఇక చెప్పాలా నా ఆనందం. "అంత శక్తే వుంటే, ఏ ఉద్యోగంలోనో వుండనే వుండేవాణ్ణి. నాకు ఎండలు పడవు.. ఆశీర్వచనాలు పంపుతాను" అన్నాను.

"అలా వీలు కాదు.. వచ్చి తీరవలసిందే. కావలిస్తే కారు పంపుతాను. చల్లటి చోటున కూర్చోబెడతాను.. భోజనం ప్రత్యేకంగా  ఏర్పాటు చేస్తాను" అన్నాడాయన.

ఆయన మాట వినడంలేదని – అలాగేలెమ్మని ఒప్పించి పంపాను. ఆ రోజు ఏమవుతుందో చూద్దాంలే అనుకున్నాను. తర్వాత ఆశీస్సులు పంపిస్తూ "ఈసారికి క్షమించాలి. దేశం చల్లబడిన తర్వాత మీ యింట్లో ముందుగా ఏ శుభకార్యం వస్తే దానికి వస్తాను" అని వ్రాసి పంపాను.

ఆయనగారికి కోపం వచ్చింది కాబోలు "ఏడాదిదాకా అల్లాంటివి, మా యింట్లో ఏమీ వుండవు. మా మనుమడు పుడితే బారసాల జరపాలి. బహుశా అందాకా అవకాశం వుండదు" అన్నారు.

"వేసవి కాలం అంత సుఖమైన కాలం మరొకటి లేదండీ, నిజానికి చక్కగా మామిడి పళ్ళూ, మల్లెపూవులు, పనస తొనలు, క్రొత్త ఆవకాయ, చింతచిగురు పప్పు, అప్పుడప్పుడూ కందకూర, ఆరు బయట నిద్ర, చన్నీళ్ళ స్నానం అహాహా! ఎంత బాగుంటుంది. అందులో పెళ్ళి భోజనాలు.. వేసవి ఎంత అనుకూలమైన ఋతువండీ" అన్నాడొక బలశాలి.

నిజమే కొంచెం బలం, విశ్రాంతీ వున్న వాళ్ళకు వేసవి 'పులికాపు'లాటిది. శరీరాలు పుటంపెట్టిన లోహాలులాగా తయారవుతాయి.

జానపద వాంఙ్మయంలో కూడా వేసవికి సంబంధించిన సంబరాలు, సరసాలూ చాలా వున్నాయి. ప్రేమికులకు విశాల ప్రకృతి ఘనంగా స్వాగత మిస్తుంది. ఏటి ఒడ్డులు కూడలి స్థలాలవుతాయి.

ఏటి గాలికి సరసమెవరి మోహము కొరకు? నట్టనడి ఇసుకలో మిట్టపై కూర్చుండి ఒట్టెట్టిపోయింది ఒట్టొట్టి మాటలా!... – అంటూ జానపద నాయిక ఎంతో వేదనపడుతుంది.

మంచి వెన్నెలుంది
మల్లె పూవులున్నయి.
ఎన్నెల్లో పూలన్నీ
ఏకంగా పరిసేసి
ఎదురు సూసే వరకూ
ఎక్కడా లేవయె
వెన్నెలంటే పడదా!
మల్లెలంటే పడదా!
మనసిచ్చి కూసున్న
చిన్నదంటే పడదా!...
తొలకరొచ్చేదాక
దొరకవా నా సామి

– అంటూ ఒక విరహిణి ఆవేదన వెలిబుచ్చింది. అయితే ఈ సరసాలు చెట్ల నీడల్లో చల్లగా వుండే పల్లెల్లో, ప్రక్కన మెల్లగా ప్రవహించే ఏటి ఒడ్డులుగల పల్లెల్లో.

ఎలక్ట్రిసిటీ ఆగిపోయి, మధ్య మధ్య ఫానులు నిలిచిపోయే పట్టణాల్లో కాదు.. పంపులో నీళ్ళు రాక దాహానికి కొట్టుకునే పట్టణాల్లో కాదు.

Post your comments